


# అందాల దీపం

ఆర్. సంధ్యాదేవి

విజయ్‌గోపాల్ ఆఫీసుకి వెళ్ళడానికి తయారవుతున్నాడు. రేఖ అతని దగ్గరగా వెళ్ళి ఏదో చెప్పాలి అన్నట్టు చెయ్యిపట్టుకుంది.

ఏమిటి అన్నట్టు నవ్వుతూ చూశాడు భార్యవైపు. అతని కళ్ళల్లో అనురాగం నిండుగా తొణికిసలాడింది.

"మీతో ఒక విషయం చెప్పాలి" అంది మెల్లగా. అలా అంటున్నప్పుడు ఆమె చెంపలు సిగ్గుతో ఎర్రగా కుంకుమ అద్దినట్లు అయ్యాయి.

"ఏమిటీ!" ఆమె కళ్ళల్లోకి కొంటెగా చూశాడు.

రేఖ భర్త తలని రెండు చేతులతో పట్టుకుని కాస్త క్రిందకు వంచి చెవిలో మెల్లగా ఏదో చెప్పింది. చెప్పటం అయిపోగానే తనపని అయిపోయింది అన్నట్టు ముఖం పక్కకు తిప్పుకుంది. అంతే అతని కనుబొమ్మలు ప్రశ్నార్థకంగా ముడుచుకున్నాయి. తల వెంటనే పైకి ఎత్తి మనిషి సిటారుగా అయ్యాడు. అతని ముఖంలో వెంటనే రంగులు మారాయి. ముఖంలో నవ్వు మాయమయింది. "టైము అయింది వస్తాను" అంటూ ఆమెకు మరోమాటకు అవకాశం ఇవ్వకుండా ఆఫీసుకి వెళ్ళిపోయాడు. భర్తకి ఆ విషయం ఏమాత్రం ఆనందం కలగనట్లు విని అలా వెళ్ళిపోవడం బాలా బాధ అనిపించింది. అవమానంగా కూడా తోచింది.

రేఖాదేవికి కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి.

పెళ్ళి చేసుకున్నదగ్గరనుండి మనసుకి శాంతి లేకుండా అయింది. యింట్లో ఆయన మాటే చెల్లాలి. పట్టిన పంతం విడవరు మొండి మనిషి. తను ఏమైనా అంటే చాలు ఆ మాటల్లో ఇంకేదయినా అర్థం ఉందేమో అని ఉడికిపోతారు. పైగా అలిగి కూర్చుంటారు. అలాటి ఈయనకు తను అంటే ఇష్టంలేదా అంటే తను అంటే ప్రాణం. ఒక్క నిముషం చూడకపోతే ఉండలేరు. ఆఫీసు నుండి రాగానే చిరునవ్వుతో ఎదురు వెళ్ళాలి. అలా వెళ్ళకపోతే ఆ రోజు అంతా దేనికోదానికి చిరాకు పడుతూనే ఉంటారు. ఆ చిరాకు ఎందుకో చెప్పరు. తను గ్రహించుకోవాలి. ఆయన ఏదీ నోటితో చెప్పరు. ఆయనకు మనసులో ఏముందో తను తెలుసుకుని మసలాలి. అదీ ఆయన గారి గడుసుతనం. నిజం చెప్పాలి అంటే ఆయన తనకి ప్రాణంతో సమానం. తనకి విజయ్‌గోపాల్‌కి పెళ్ళికాకముందు ఎలా పరిచయం అయింది! అంతా గుర్తు చేసుకోసాగింది.

* * *

ఆరోజు సినిమాకు వెళ్దాం రమ్మని హైమ కబురుచేసింది, వాళ్ళ ఆయన సుదర్శనం ఎక్కడికో వెళ్ళేడు అని. రేఖ వెళ్దామనే అనుకుంది. అయితే వాళ్ళ యింటికి చుట్టాలు ఎవరో రావడంతో సినిమాకు వెళ్ళటం అవక హైమకు ఈ విషయం చెప్పివద్దామని వాళ్ళ యింటికి వెళ్ళింది.

హైమ యింటికి వెళ్ళి చెప్పింది. ఆమె అంది "మా ఆయన ఎక్కడికో వెళ్దామనుకున్నారు. కాని ఎవరో ఫ్రెండ్‌ని భోజనానికి పిల్చారు. నాకూ రావటం కుదరదు."

"ఆహా! సరే అయితే" అని చెప్పి వచ్చేద్దామనుకుంటే హైమ వెంటనే వెళ్ళనివ్వలేదు.

కాసేపు వాళ్ళ యింట్లో కూర్చుంది.

సుదర్శనం ఆఫీసునుండి యింటికి వచ్చాడు. కూడా ఒక అతన్ని వెంటబెట్టుకు వచ్చాడు.

హైమ అతను వస్తుంటే తెలీకుండా రేఖకి రహస్యంగా చూపిస్తూ "అతని పేరే విజయ్‌గోపాల్. మా ఆయనతోనే పని చేస్తున్నాడు. ఇంజనీర్. అతను పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళి చేసుకోడు అట."

"ఏం? ఎందుకు చేసుకోడు!" ఆశ్చర్యంగా అడిగింది.

"అతనిది ఒక కథలే. మనసు విరిగి పోయి ఆ నిర్ణయానికి వచ్చేశాడు."

రేఖ మౌనంగా ఉండిపోయింది.

సుదర్శనం భార్యను పిల్చి ఫ్రెండ్‌కి పరిచయం చేశాడు. హైమకి అతని ఎదుట పడి మాట్లాడటం అదే మొదటిసారి. అతను ఎవరింటికీ వెళ్ళడు.

భార్యతోపాటు రేఖను కూడా పిల్చి పరిచయం చేశాడు.

ఆడవాళ్ళవైపే సరిగా చూడని విజయ్‌గోపాల్ ఒక్కక్షణం రెప్ప వాల్చకుండా అలాగే రేఖవైపు చూశాడు,

నేవీబ్లూ జార్జెట్ చీర కట్టుకుంది. దానికి మాచ్ అయ్యే నేవీబ్లూ జాకెట్ వేసుకుంది. చీరె చెంగు బుజాల చుట్టూ తీసి కప్పుకుంది.

బాగా పొడవుగా ఉన్న జుత్తుని జడ అల్లుకుంది. ఉంగరాల జుత్తు చెంపని తాకుతూ యింక అందాన్నిస్తుంది. కుడి చేతికి గాజులు వేసుకుంది. ఎడంచేతికి వాచీ పెట్టుకుంది.

కళ్ళకు కాటుక తీర్చిదిద్దిందేమో ఆ కోలకళ్ళు ఇంకా విశాలంగా అందంగా మిలమిల మెరుస్తున్నాయి. పెదవులకి లిప్‌స్టిక్ వేసుకుంది.

సన్నగా అందంగా దిద్దినట్టున్నాయి కనుబొమ్మలు. నుదుట ఎర్రని గుండ్రంగా పెద్దబొట్టు పెట్టుకుంది. ముఖం కళకళ లాడుతూ నిండుగా అందంగా ఉంది. సన్నగా పొడవుగా రివటలా నాజూగ్గా ఉంది.

రేఖ చామనచాయ అయినా ఎంతో అందంగా ఆకర్షణీయంగా చక్కగా బొమ్మలా కనిపించింది.

ఆమెను ఇంకా ఇంకా అలాగే చూడాలనిపించినా అది మర్యాద కాదని చూపులు మరోవైపుకి తిప్పుకున్నాడు.

రేఖ అతనివైపు ఒక్క క్షణంసేపు అలాగే చూసింది.

విజయ్‌గోపాల్ తెల్లని తెలుపుమనిషి. బాగా పొడవుగా పొడవుకి తగిన ఒళ్ళుతో చాలా అందంగా ఉన్నాడు.

మనిషి తెలుపుకి తగినట్టు ఉంగరాల జుత్తు ఇంకా అందానిచ్చింది. మగవాళ్ళకి మీసాలు లేకపోతే అందంగా ఉండరు అన్న మాట పొరపాటు అన్నట్టు చేశాడు. షేవ్ చేసుకున్నంతమేరా ఆకు పచ్చగా నీడలు తేరుకున్నాయి అతని చెంపలు.

అంత అందమైన మనిషికి కళ్ళు మాత్రం కొద్దిగా చిన్నవి. అయితే కళ్ళు చిన్నవి అయినా ఆ కళ్ళల్లో ఏదో నిషా దాగున్నట్టే ఉన్నాయి.

అలా నిషాకళ్ళు ఉంటే మనుషుల్ని చూడనట్టే ఉంటారు. కాని వారగా చూస్తూనే ఉంటారు.

బ్లాక్ పేంట్ ఫుల్‌హాండ్స్ వైట్‌షర్ట్ టక్‌చేసుకున్నాడు.

మనిషిలో రాజసం ఉట్టిపడ్తుంది, చెదరని గంభీరత, హుందాతనం, దర్జా అతని స్వంతం అయ్యాయి.

ఆ కూర్చోటంలో మాట్లాడటంలో, తలతిప్పి చూడటంలో ఆమె చేతులు జోడించి నమస్కరిస్తే చిరునవ్వుతో తల ఊపడం మనిషిలో ఠీవి రెట్టింపు అవుతున్నాయి.

రేఖ క్షణంసేపు అలా చూస్తూ ఉండి పోయింది.

కాస్సేపు అక్కడే కూర్చుని హైమకి చెప్పి, వాళ్ళ ఇద్దరికి చెప్పి రేఖ వెళ్ళి పోయింది.

ఆమె వెళ్ళినవైపే చూస్తున్న విజయ్ గోపాల్‌ని ఆ భార్యాభర్తలు ఇద్దరూ గమనించి ముఖాముఖాలు చూసుకున్నారు.

ఆరోజు మొదలు రేఖకి విజయ్ గోపాల్ ఎక్కడో ఒకచోట కనిపిస్తూనే ఉండేవాడు.

అతన్ని చూడగానే ఆమె అలా ఉండి పోయేది. అతను మాత్రం ఆమెవైపు అసలు చూడకుండా వెళ్ళిపోయేవాడు.

రోజులు గడుస్తున్నాయి.

రేఖ యింటిముందు నుండి అతను ఆటోలో రోజూ వెళ్ళటం గమనించేది. అతనికి ఇంతదూరం రావలసిన పనేమిటబ్బా అనుకునేది. ఆ మాటే ఒకసారి హైమతో అన్నది. మాటల్లో హైమ ఆశ్చర్యపోయింది.

అతను ఆఫీసునుండి రాగానే తన రూమ్‌లోనే ఉంటాడట. ఎక్కడికీ వెళ్ళడట. నువ్వు ఎవర్ని చూసి ఎవరు అనుకున్నావో.

"అయ్యో నా కళ్ళతో నేను చూశాను ఆయనే అంది రేఖ. రానురాను అతను తమ యింటిముందుగా ఆటోలో వెళ్ళటం చూస్తుంటే కావాలనే వస్తున్నట్టుగా అనిపించ సాగింది ఆమె మనసుకి. అది నిజమో కాదో తెల్సుకోలేకపోయింది.

అతను చూస్తే తనవైపు అసలు చూడటంలేదు. చిత్రంగా అనిపించ సాగింది.

* * *

సుదర్శన్ యింటికి విజయ్‌గోపాల్ ప్రతీ ఆదివారం వెళ్తూండేవాడు. పిలవకుండా రానివాడు ఇలా ప్రతి ఆదివారం రావటం అతనికి ఆశ్చర్యంగా ఆనందంగా కూడా అనిపించసాగింది.

విజయ్‌గోపాల్ ఉన్నప్పుడు రేఖ ఎప్పుడైనా వచ్చినా అతని ముఖంలో ఎలాటి భావం తొణికిసలాడేది కాదు.

రేఖ వచ్చినట్టుకూడా గమనించేవాడు కాదు.

అయితే అతనిలో చాలా మార్పు

రావటం సుదర్శనం దంపతులు గమనించారు.

ఎప్పుడూ ఎవరితో కలవకుండా అందరితో ముభావంగా ఉండే మనిషిలో చాలా మార్పు వచ్చింది.


ఎప్పుడూ వీళ్ళయింటికి రాని మనిషి తరుచూ రావటం సరదాగా మాట్లాడటం అలా విజయ్‌గోపాల్‌లో చాలా మార్పు వచ్చేసింది. ప్రతి మగాడి వెనక ఒక స్త్రీ హస్తం ఉంటుందేమో అన్నది నిజమైంది అతని విషయంలో.

అతను ఇప్పుడు హుషారుగా సరదాగా కనిపించసాగాడు. సుదర్శన్ దంపతులు అతని మనసులో ఉద్దేశం కనిపెట్టేశారు. అతనికి కాబోయే భార్య గురించి చాలా కోరికలు ఉండేవి. సన్నగా నాజూగ్గా చెంపకు చేరదేసి కళ్ళున్న అమ్మాయి. ఉంగరాల జుత్తులాగా పొడవుగా ఉన్న జడతో ఎంతో అందంగా చక్కగా ఉండాలని.

నుదుట పెద్దబొట్టు పెట్టుకుని నిండుగా చక్కగా ఉండాలని, అతను బాగా పొడవుగా ఉంటాడు కాబట్టి కాబోయే భార్య కూడా తనకి తగినట్టు పొడవుగా నాజూకు సుందరిలా ఉండాలని అనుకున్నాడు.

అలా కలలు కంటూ అటువంటి అమ్మాయి దొరికినప్పుడు పెళ్ళిచేసుకోవాలని ఆశపడే టైములో అతని గుండె పగిలిపోయినట్టుగా ఒక సంఘటన జరిగిపోయింది. ఆ సంఘటనతో అతని తల్లి బెంగతో కృశించి క్రుంగిపోయింది. తండ్రి మంచంపట్టి మరణించాడు.

విజయ్‌గోపాల్ ఒక్కగానొక్క చెల్లెలు సుమిత్ర ఎమ్.ఏ. చదువుతుండేది. కులం, మతం అన్నీ మరిచి దేసీ అనే అతనితో ఎవరికి తెలీకుండా పెళ్ళిచేసుకు వెళ్ళిపోయింది. పరువుగా బ్రతుకుతున్న కుటుంబం నవ్వులపాలు అయింది. నేను పుట్టిన వంశం గొప్పది,



నా వంశగౌరవం ఎటువంటిది అని గర్వపడిపోయినవిజయగోపాల్, చెల్లెలు ఎవరితోనో లేచి వెళ్ళిపోగానే కంగు తిన్నట్టయ్యాడు. ఫ్రెండ్స్ ఎదుట తల ఎత్తుకోలేకపోయాడు. ఫలానా అతని చెల్లెలే దేసీ అన్న అతనితో లేచి వెళ్ళిపోయింది అని అనుకుంటూ చాటుగా నవ్వుకోవటం మొదలుపెట్టారు. తండ్రి ఈ అవమానం భరించలేక మంచంపట్టి చనిపోవటంతో విజయ్‌గోపాల్ దెబ్బ తిన్నట్టయ్యాడు. మనిషి కృంగిపోయాడు. ఇక జీవితంలో తను పెళ్ళి చేసుకోకూడదు అని భీష్మించుకు కూర్చున్నాడు. ఫ్రెండ్స్ గాని యింట్లోవాళ్ళు గాని ఎవరైనా అతని పెళ్ళిమాట ఎత్తితే కోపంతో మండిపడిపోయేవాడు.

పెద్దింటి ఆడపిల్ల అంత సిగ్గువిడిచి తెగించి లేచివెళ్ళిపోవటం పాత పద్ధతుల్లో నడిచే అతనికి అది చాలా అవమానంగా అనిపించి తను పెళ్ళిచేసుకుంటే మాత్రం తన జీవితంలో ప్రవేశించిన అమ్మాయివాళ్ళ యింటివాళ్ళు అందరూ తనని వేలెత్తి చూపించరూ! అందుకే అతను పెళ్ళిమాట మరిచిపోయి జీవితం అంతా బ్రహ్మచారిగానే గడపటానికి నిశ్చయించుకున్నాడు.

అయితే అనుకున్నవి అనుకున్నట్టుగా జరగవు. బ్రహ్మదేవుడు వ్రాసిపెట్టిందే జరిగి తీరుతుంది. ఎలాటి నిర్ణయాలయినా ఎంతటి కఠినమైన మనసు అయినా ఆ టైము వస్తే అన్నీ మారిపోయి తీరతాయి. భగవంతుడి నిర్ణయం ప్రకారం జరిగి తీరుతుంది. సుదర్శనం దంపతులు అతని మనసులో ఉద్దేశం గ్రహించేశారు. రేఖాదేవిని అతను ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తున్నాడని, అది పైకి చెప్పలేక సతమతమైపోతున్నాడని తెలిసిపోయింది.

విజయ్‌గోపాల్‌ని ఒకరోజు భోజనానికి పిలిచి, రేఖను అతన్ని పెళ్ళిచేసుకోమని అడిగారు. అది అతనికి సంతోషం అయినా పైకి తేలకుండా, 'అహ నాకు ఇష్టంలేదు' అని చెప్పాడు. అయినా ఆ దంపతులు ఊరుకోలేదు. బలవంతంగా ఒప్పించారు. వాళ్ళమాట తీసేయలేక ఒప్పుకున్నట్టు ఒప్పుకుని ఒక షరతు పెట్టాడు. రేఖాదేవి నన్ను ఇష్టపడి వాళ్ళ యింట్లోనుండి వచ్చేసి నన్ను పెళ్ళిచేసుకోవడానికి అంగీకరించాలి. వాళ్ళ అందరికీ ఆమె దూరంగా ఉండాలి. మా పెళ్ళి జరిగినట్టు నేను ఎవ్వరికి చెప్పేవరకూ ఆమె ఎక్కడా చెప్పకూడదు అని.

* * *

సుదర్శనం దంపతులు రేఖను ఒప్పించి కోవెలలో విజయ్‌గోపాల్, రేఖాదేవిల పెళ్ళి జరిపించి వేరే యింట్లో వాళ్ళని ఉంచారు. విజయ్‌గోపాల్ తను పనిచేస్తున్న ఆఫీసులో ఫ్రెండ్స్‌కి ఎవరికీ తెలీకుండా పెళ్ళిచేసుకుని వేరే యింట్లో భార్యతో హాయిగా ఉండసాగాడు.

రేఖ తన అదృష్టానికి మురిసి పోయింది. అందంగా, దర్జాగా కథల్లో రాజకుమారుడిలా ఉండే భర్త దొరకటం నిజంగా అదృష్టమే. ఆ మాటే అతనితో చాలాసార్లు అంది.

తన ఊహాసుందరి వెన్నెల బొమ్మ, నాజూకురాణి తనకి భార్య కావటం అతని అదృష్టం అని మురిసిపోయాడు. ఆ మాటే భార్యతో చాలాసార్లు అన్నాడు.

డాబా మీద మంచంమీద ఆమె ఒడిలో తలపెట్టుకుని పడుకుంటూ అన్నాడు.

"నీ అందచందాలతో, నీ మంచి తనంతో కఠినమైన నా మనసుని కరిగించి నన్ను నీవాడ్ని చేసుకున్నావు" అంటూ నవ్వాడు. అతని క్రాప్‌లోకి వేళ్ళు పోనిచ్చి నవ్వుతూ అంది.

"పెళ్ళి కానప్పుడు వచ్చిన సంబంధాలు అన్నిటికి ఏవో వొంకలు పెట్టి తిరిగి పంపేసేదాన్ని. మిమ్మల్ని చూసిన క్షణం ఏమిటో నన్ను నేను మరిచి పోయాను. మీరు అందరికంటే చాల అందమైనవారని, అందంలో ఆకర్షణ, ఠీవి, దర్జా, రాజసం ఉట్టిపడుతుంటే మీలో ఒక ప్రత్యేకత ఉందని, మీ వ్యక్తిత్వం చాలా గొప్పదని, మీకంటే అందరూ చాలా తక్కువ అన్న భావం నాలో ఏర్పడిపోయింది. మీరు నన్ను వివాహం చేసుకుంటానని అనగానే నా అదృష్టానికి నేను ఎంత పొంగిపోయానో మాటలతో వర్ణించలేను" అంటూ అతని తలపై తన తల ఆన్చుకుంది మైమరపుగా.

విజయ్‌గోపాల్ గుండెల్లో నిండుగా పొంగిపొర్లుతున్న అనురాగంతో, అపురూపంగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. పెళ్ళి అయ్యాక వాళ్ళు ఎంతో ఆనందంగా, హాయిగా రోజులు గడపసాగారు.

అయితే వాళ్ళ ఇద్దరి మనస్తత్వాలు ఒకటి కావటంతో వాళ్ళలో వాళ్ళకి అలకలు, కోపాలు, ఉడుకుమోత్తనాలు ఎక్కువైపోయాయి. ఆమె ఎవరివైపు కన్నెత్తి చూడకూడదు, మాట్లాడకూడదు అది విజయ్‌గోపాల్ భరించలేడు.

అతను ఎవరివైపు కన్నెత్తి చూడకూడదు. అమ్మాయిలతో మాట్లాడకూడదు. అది రేఖాదేవి భరించలేదు.

ప్రేమా, అనురాగం ఉన్నచోటే ఈర్ష్యలు, అనుమానం మనిషిలో తల ఎత్తుతాయి.

భార్య అంటే భర్తను గౌరవించాలి, పూజించాలి. అతని మాటకు ఎదురుచెప్ప కూడదు అన్న తత్వం అతనిది.

భర్త ఎంత వీరాధివీరుడు అయినా ఎన్ని రాజ్యాలు జయించి చక్రవర్తి అయినా భార్యకు భర్త ఎప్పుడూ లోకువే. 'కడవంత గుమ్మడి కత్తిపీటకు లొంగే' అన్న సామెత ఉండనే ఉంది. వీధిలో మగవాళ్ళు ఎంత ధైర్యంగా మీసాలు మెలిపెట్టుకు తిరిగినా యింటి వద్దకు వచ్చి భార్యను చూడగానే పిల్లి అయిపోవటం సహజం.

రేఖ అతనికి తెలియకుండానే ఆమె కొంగుకి ముడేసుకుంది ఎప్పుడో.

రేఖ పెళ్ళి జరిగిందగ్గరనుండి రోజులు గుర్తుతెచ్చుకుని ఆలోచిస్తూ ఉండి పోయింది. పిల్లలు అంటే అతనికి ఇష్టమే. తండ్రి కావాలని సంబరమే అయితే ఇన్నాళ్ళు పెళ్ళిచేసుకోను అని చెప్పిన పెద్దమనిషి గుట్టుచప్పుడు కాకుండా పెళ్ళిచేసుకోవటం, పిల్లలతండ్రి కావటం అందరికి తెలిసిపోతే ఇంకా నవ్వుకుంటారని అతని భయం.

రోజులు నెలలు గడుస్తున్నా ఆమె వద్ద ఆ విషయం అతను ఎత్తలేదు. ఆమెకు ఏడవమాసం వచ్చింది. అయితే విజయ్‌గోపాల్ భార్యకు మందులు, పాలు, పండ్లు శ్రద్ధగా టైముకి ఇవ్వ సాగాడు. ఆమెను అపురూపంగా చూడ సాగాడు. అయినా రేఖ మనసులో ఏదో నిరాశ! ఎందుకు ఈ జీవితం? ఈ రహస్యంగా పడిఉండటంలో అర్థం! సుమిత్ర ఏదో వెధవపని పరువుతక్కువ పని చేసింది అని ఆయన మనసులో బాధ పడి కృంగిపోవటం దానికి శిక్ష. ఒక సరదా లేక, సంతోషం లేకతను అనుభవించటం భర్త ఎంత అపురూపంగా అనురాగంగా చూసినా లోకం కాకులతో సమానం. రకరకాలుగా అనుకుంటారు. వాళ్ళ కుటుంబంలో ఎన్ని మచ్చలు ఉన్నా అవి కప్పిపుచ్చి ఎదుటివాళ్ళని చూసి పళ్ళు ఇకిలిస్తారు. అది వాళ్ల లేకితనం అనుకుని సరిపెట్టుకోవాలి. అది ఈయనకి చెప్తే అర్థంకాదు.

విజయ్‌గోపాల్‌కి చెల్లెలు సుమిత్ర అంటే పరమ అసహ్యం. ఆ పేరు ఎత్తితే అన్నందగ్గర నుండి లేచిపోతాడు కూడా. ఈ జీవితం ఇలా ఎన్నాళ్ళు! రేఖ మనసులో బాధపడసాగింది.

ఒకరోజు విజయ్‌గోపాల్ భార్యతో అన్నాడు.

"రేఖా! నువ్వు ఈ రోజు నుండి ఎక్కడికీ వెళ్ళకు ఒంట్లో బాగోలేదని గదిలోనే అలా పడుకో" అంటూ. అతని మనసులో ఉద్దేశం గ్రహించి రేఖ ఛర్రుమంది.

"ఏం ఎందుకని! మీరు తండ్రి కాబోతున్నారు అని అందరికీ తెలిసి పోతుంది అని భయమా! ఎన్నాళ్ళు దాస్తారు! పుట్టిన బిడ్డని దాయగలరా! వాడు పెరిగి స్కూలుకు వెళ్తుంటే దాయగలరా! ఇలా ఎన్నాళ్ళు! మీరు అనుకుంటున్నారు. మీరు ఇంకా పెళ్లిచేసుకోలేదు అనే అందరూ అనుకుంటున్నారు అని.



పిల్లి కళ్లుమూసుకు పాలు త్రాగితే లోకం అంతా కళ్ళు మూసుకుంటుందా! మన పెళ్ళి జరిగిపోయింది అని, విజయ్‌గోపాల్ భార్యను నేను అని అందరికీ తెలిసే పోయింది. ఇంకా దాస్తే ఉన్న పరువు కూడా పోతుంది" అంటూ కోపంగా అంది.

భార్య తనని అంత సూటిగా అడిగే సరికి అతను ఉడికిపోయాడు. ఆ తరువాత అలక వచ్చేసింది. ఆ పైన భోజనం మానేసి ఆకలి లేదంటూ పడుకుండి పోయాడు.

* * *

విజయ్‌గోపాల్‌కి ఆఫీసులో మనసు ఏమీ బాగుండక త్వరగా యింటికి వచ్చేశాడు. అతను భోజనం చెయ్యకపోతే రేఖ కూడా భోజనం మానేస్తుంది అని తెలుసు. ఆమె బాధపడితే తను చూడ లేడు. అందుకే త్వరగా యింటికి వచ్చేశాడు. రేఖ మౌనంగా వంటగదిలో తన పని తాను చేసుకోసాగింది. ఆమె కోపంగా ఉంటే పలకరించే ధైర్యం అతనికి ఉండదు. అయినా మెల్లగా వంట గదిలోకి ఏం కావాలో అడిగి అడిగి మరీ సాయం చెయ్యసాగాడు. ఒద్దూ అన్నా వినకుండా కూడా తిరగసాగాడు.

రేఖకు నవ్వు వచ్చినా పైకి ముభావంగా ఉండిపోయింది. భర్తను చూస్తే జాలి కూడా వేసింది. పాపం ఈయనకి ముక్కు మీదే కోపం. అది అయినా కాస్సేపే మళ్ళీ వెంటనే పోతుంది. మర్చిపోయి మామూలుగా మాట్లాడేస్తారు. భోజనాలు అయ్యాక భార్యను దగ్గరకు తీసుకుంటూ, "ఈ రోజు సెకెండ్‌షో సినిమాకు వెళ్దామా!" అన్నాడు. ఆమె కోపం పోగొట్టాలన్న ఉద్దేశంతో.

రేఖ ఆ మాటలకి కాస్త మెత్తబడి అలాగే అన్నట్టు నవ్వుతూ తల ఊపింది. "ఏ సినిమాకు!" అడిగింది.

"జగదాంబలో మంచి ఇంగ్లీషు సినిమా వేస్తున్నారు. బాగుంది అట. దానికి వెళ్దాం. త్వరగా తయారవు" అన్నాడు.

"స్కూటర్ మీద వెళ్దామా!" అంది

భర్తతో స్కూటర్ మీద వెళ్ళటం ఆమెకు ఇష్టం. అతని నడుం పట్టుకుని కూర్చోవచ్చు. చక్కగా అందరూ అలా వెళ్ళటం చూస్తుంది తను.

"ఊహు కారులో వెళ్దాం. స్కూటర్ మీద వెళ్తే అందరికీ కనపడిపోతాం. కారులో వెళ్తే సరిగ్గా తెలీదు" అన్నాడు.

"చిత్రంగా మాట్లాడతారు. కారులో వెళ్తే మనని ఎవరూ చూడరూ! అదీకాక డ్రయివర్ ఇప్పుడు వస్తాడేమిటి! జగదాంబలో కారు పెట్టడానికి ప్లేస్ కూడా ఉండదు. స్కూటర్ మీద వెళ్దామండి" అంది గారంగా.

"డ్రయివర్ ఎందుకు! నేను డ్రయివ్ చేస్తానుగా కారులో వెళ్దాం పద" అన్నాడు.

రేఖకు ఒళ్ళు మండిపోయింది. "నేను స్కూటర్ మీద అయితే వస్తాను లేకపోతే రాను" అంది మహా మొండిగా పెంకిగా.

"అయితే నిన్ను సినిమాకే తీసుకెళ్ళను. ఫో ఫో బయటకు" అంటూ కోపంగా కసిరిపారేశాడు.

రేఖకు భర్త అలా కసరగానే గొప్ప అవమానం అయిపోయి దుఃఖం ముంచుకు వచ్చేసింది. "మీకు ఎందుకు అంత దొంగ భయం! నన్ను ఎత్తుకువచ్చి పెళ్ళి చేసుకున్నారా!" అడిగింది కోపంగా ఉక్రోషంగా.

"నిన్ను ఎత్తుకువచ్చి పెళ్ళిచేసుకునే దాకా నాకేం ఖర్మ. నువ్వేం అంత పెద్ద అందగత్తెను అనుకుంటున్నావా!" అన్నాడు అతను ఉడికిపోయి కోపంగా.

భర్త మాటలకి మరీ ఉడికిపోయింది. తను అందరిలో ఎంతో అందగత్తెనని పేరు తెచ్చుకుంది. ఈయన తనని కోరి కోరి పెళ్ళిచేసుకున్నారు. ఇప్పుడు ఇలా అంటారా!

"అందుకే పాపం నా యింటిచుట్టూ పదిసార్లు తిరిగితిరిగి కోరికోరి పెళ్ళి చేసుకున్నారు" అంది మహా కోపంగా, ఉక్రోషంగా. ఆమెకు దుఃఖం పొంగిపొంగి వచ్చేస్తుంది.

"నువ్వా! నేనా! నువ్వే నా వెంట పడ్డావు! నేను సుదర్శనం యింటికి వెళ్ళటం గమనించి నువ్వు ఆ టైముకి రావటం మొదలుపెట్టావు" అన్నాడు అతను ఇంకా ఉడికిపోతూ.

"మీరే నా వెంటబడి పెళ్ళిచేసుకున్నారు" అంది కన్నీళ్ళతో.

"నువ్వే నా వెంటబడ్డావు!" అన్నాడు ఉడికిపోతూ.

"వంకాయి వేషాలు" అంది నోట్లో గొణుక్కుంటూ.

"ఏమన్నావ్?" అడిగాడు. "ఏం అనలేదు" అంది మూతి బిగిస్తూ.

"దొంగ మొఖం, దొంగ కళ్ళు, దొంగ చూపులు. దొరకడు ఈ మనిషి" అంది, కొన్ని మాటలు పైకి అంటూ కొన్ని మాటలు మింగేస్తూ. వినిపించినా వినిపించనట్టే ఉండిపోయాడు విజయ్ గోపాల్.

* * *

రేఖాదేవికి కొడుకు పుట్టాడు. బాబు తెల్లగా ఆరోగ్యంగా అందంగా ముద్దులు మూటకడ్తూ ఉన్నాడు. బాబుని చూస్తూనే అతను అన్ని బాధలూ మర్చిపోయాడు. పితృగర్వంతో పొంగిపోయాడు విజయ గోపాల్.

తమ అనురాగ దాంపత్యానికి తీపి గుర్తుగా పుట్టిన బాబు. తన రక్తాన్ని పంచుకుని పుట్టాడు. తన ప్రతిరూపం అనుకుంటూ బాబుని అపురూపంగా గుండెలకు అదుముకున్నాడు.

బాబు పుట్టడంతో వాళ్ళల్లో ఉడుకుమోత్తనం, అలకలు, చిలిపి కయ్యాలు మాయమయ్యాయి.

ఆరోజు రాత్రి బాబుని గుండెలకు అదుముకుంటూ భార్యతో అన్నాడు. "రేఖా నువ్వు నా భార్య కావటం నిజంగా నా అదృష్టం. నీ మొండితనం, నీ పెంకితనం, నీ గడుసుతనం, నీతెలివితేటలు అన్నిటికీమించి నీ అందం, అందంలో ఆకర్షణ నా స్వంతంకావటం, అహా" అంటూ మురిసిపోయాడు.

"మీరు అంటే నాకు ప్రాణం. మీ అందం, మీ దర్జా, ఎవరికి తలవంచని వ్యక్తిత్వం నాకు ఎంతో ఇష్టం" అంది గర్వంగా నవ్వుతూ.

"నీ అందమైన కోలకళ్ళు అంటే నాకు మరీమరీ ఇష్టం" అన్నాడు కొంటెగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

"మీ నిషా కళ్ళు అంటే నాకు మరీ మరీ ఇష్టం" అంది అతని గుండెలమీద తల ఆన్చుకుంటూ.

బాబు నా మాట మర్చిపోయారా అన్నట్టు ఏడ్వటం మొదలుపెట్టాడు.

ఇద్దరూ బాబుని అపురూపంగా ఊరుకోబెట్టి బాబుకి ముద్దులవర్షం కురిపించారు.

"మన కలల రూపం. మన అనురాగాల పంట."

"మన యింటికి బాబు అందాల దీపం" అనుకున్నారు, ఆ దంపతులు మురిసిపోతూ.